నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంచిర్యాల, సోమవారం 18 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఆన్‌లైన్ మోసం

- కారు అమ్ముతానంటూ ఫేస్‌బుక్‌లో పోస్టు
- లైక్ కొట్టిన వ్యక్తికి కుచ్చుటోపి
- రూ.1.43 లక్షలు స్వాహా

వాంకిడి, మార్చి 17: ఫేస్‌బుక్‌లో వచ్చిన 'కారు అమ్మబడును' ప్రకటనను చూసి ఓ వ్యక్తి మోసపోయిన ఘటన వాంకిడి మండలం పిప్పర్‌గొందిలో జరిగింది. ఈ నెల 6న.. ఫేస్‌బుక్‌లో తక్కువ ధరకే కారు అమ్మబడును అనే ప్రకటన వచ్చింది. దీనికి పిప్పర్‌గొందికి చెందిన రాథోడ్ చంద్రకాంత్ లైక్ కొట్టాడు. దీంతో తాను ఆర్మీ ఆఫీసర్ అని, తన పేరు రామ్ అగర్వాల్ అని ఓ వ్యక్తి చంద్రకాంత్‌కు ఫోన్ చేశాడు. రూ.1,35,000కే కారు అమ్ముతానని చెప్పడంతో బేరం కుదిరింది. మొదట ట్రాన్స్‌ఫోర్ట్ చార్జి పేరిట రూ.3 వేలు పంపమని చెప్పాడు. ఆపై రూ.5 వేలు.. ఇలా విడుతల వారీగా ఫోన్ చేసి చంద్రకాంత్ దగ్గర రూ.1,43,498 వసూలు చేశాడు. డబ్బులు మొత్తం పంపినా కారు రాకపోవడంతో బాధితుడు మరోసారి ఫోన్ ద్వారా సంప్రదించగా, మరో రూ.61 వేలు పంపమన్నాడు. న దగ్గర డబ్బులు లేవని చెప్పడంతో ఫోన్ కట్ అయ్యింది. ఆపై మళ్లీ ఫోన్ చేయగా, కలవలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన చంద్రకాంత్ ఆదివారం వాంకిడి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా స్ఫూర్తితో రాణించాలి

విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, మార్చి 17 : ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో రాణించి పతకాలు సాధించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని గోలేటి శ్రీ భీమన్న క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. గోలేటి రాకర్స్, తిర్యాణి డెవిల్స్ జట్లు ఫైనల్స్‌లో తలపడగా, గోలేటి రాకర్స్ జట్టు విజయం సాధించింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొటు శ్రీధర్‌రెడ్డి, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ పర్లపల్లి వనజ, గోలేటి మాజీ సర్పంచ్ పొటు సుమలత, మాజీ జడ్పీటీసీ అజ్మీర బాబురావు, డైరెక్టర్ కడతల మల్లయ్య, నాయకులు సాయి, గంగిశెట్టి సురేశ్, సమ్మయ్య, గోపాలకృష్ణ, విజయ ఉన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టాలి

- రామగుండం సీపీ శ్రీనివాస్
- పోలీసు అధికారులతో ఎన్నికల సమీక్ష

పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, మార్చి 17 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో చట్టాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి అవగాహన కల్పించేందుకు కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులకు సమీక్ష నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, అందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. అధికారులంతా ఎన్నికల నియమావళికి లోబడి పనిచేయాల్సి ఉంటుందని, ఎన్నికల డ్యూటీ చేస్తున్నటువంటి అధికారులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో గల అంశాలపై, బందోబస్తు, ప్రవర్తన, సిబ్బంది మోహరింపు, కేంద్ర బలగాలతో సమన్వయం తదితర అంశాలపై స్పష్టత ఉండాలన్నారు. ప్రతి ఎన్నికల్లో కొత్త సవాళ్లు ఎదురవుతాయని, ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. నేరచరిత్ర ఉన్న రౌడీషీటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలని, వారికి కౌన్సెలింగ్ నిర్వహించి సంబంధిత అధికారుల ముందు బైండోవర్ చేయాలని తెలిపారు. ఎన్నికల సమయంలో నగదు, మద్యం అక్రమ రవాణా, అనుమానిత వాహనాల తనిఖీ, పోలింగ్ స్టేషన్‌ల నిర్వహణ తదితర భద్రతకు సంబంధించిన అంశాలను గురించి వివరించారు. వారం పాటు పోలీస్ అధికారులు, ఏఎస్ఐ, హెచ్‌సీ పీసీలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబుల జేబులకు చిల్లు

సిండికేట్‌గా మారిన మద్యం వ్యాపారులు

- ఒక్కోబాటిల్‌పై అదనంగా రూ. 10 వసూలు
- బెల్ట్ షాపుల్లోనైతే రూ. 20 నుంచి రూ. 30 దాకా..
- మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలకు సరఫరా..
- రాజకీయ నాయకుల అండదండలతోనే దందా!
- ఎక్సైజ్ అధికారుల సహకారమున్నట్లూ ఆరోపణలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): జిల్లాలో సిండికేట్‌గా మారిన మద్యం వ్యాపారులు మందుబాబుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఒక్కో మద్యం బాటిల్‌పై ఎమ్మార్పీ కన్నా రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. ఈ దందా గురించి ఎక్సైజ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిర్పూర్ డివిజన్‌లోని ఓ వైన్‌షాపులో అధిక ధరలకు మద్యం అమ్ముతున్నట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఇటీవల తనిఖీకి వెళ్లిన ఎక్సైజ్ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వెనుదిరిగినట్లు తెలుస్తోంది. మద్యం వ్యాపారుల సిండికేట్ వెనుక రాజకీయ నాయకుల అండదండలతో పాటు ఎక్సైజ్ అధికారుల సహకారం కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలకు తరలింపు..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 32 వైన్స్‌లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మద్యం సిండికేట్ దందా నడుస్తోంది. వైన్స్‌ల లైసెన్స్‌లు పొందిన మద్యం వ్యాపారులు సిండికేట్‌గామారి అధికారులతో పాటు రాజకీయ నాయకులను మచ్చిక చేసుకొని దందా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. కాగజ్‌నగర్ డివిజన్‌లో ప్రాణహిత పరీవాహక ప్రాంత మండలాల్లోని మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి మహారాష్ట్రకు మద్యం సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాంతంలోని వైన్స్ వ్యాపారులు పెద్ద ఎత్తున మద్యాన్ని ప్రాణహిత దాటి మహారాష్ట్రలోని సరిహద్దు గ్రామాలకు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ బార్డర్ చెక్‌పోస్టులు లేకపోవడంతో మద్యం అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నది.

ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం

వ్యాపారులు సిండికేట్‌గా మారి అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు మాకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ప్రతి వైన్స్‌లో సాధారణంగా డిపార్ట్‌మెంట్ నుంచి తనిఖీలు జరుగుతుంటాయి. ఇందులో భాగంగానే బెజ్జూర్‌లోని వైన్స్‌ను కూడా తనిఖీచేశాం. అంతేగాని అధిక ధరలకు మద్యం అమ్ముతున్నట్లు తమ దృష్టికి రాలేదు. గ్రామాల్లోని బెల్టు షాపులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- జ్యోతి కిరణ్, జిల్లా ఎక్సైజ్ అధికారి

విచ్చలవిడిగా బెల్టు షాపులు

సిండికేట్ వ్యాపారులు ఒక్కో బాటిల్‌పై రూ.10 అదనంగా వసూలు చేస్తుండగా, పల్లెల్లోని బెల్టుషాపుల్లో మాత్రం రూ. 20 నుంచి రూ. 30 దాకా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లోని కిరాణా షాపులన్నీ బెల్టుషాపులుగా మారాయి. మండల కేంద్రాల్లోని వైన్స్ షాపులకు రాలేని మందుబాబులు.. గ్రామాల్లో అందుబాటులో ఉండే బెల్టు షాపుల్లోనే అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పేదల జీవితాలపై బెల్టుషాపులు అధిక ప్రభావాన్ని చూపుతున్నాయి. ముఖ్యంగా కూలీ, వ్యవసాయ పనులు చేసుకొని జీవించే పేదల కుటుంబాలను బెల్టు దుకాణాలు వీధిన పడేస్తున్నాయి.

వెంకట్రావుపేట చెక్‌పోస్టు వద్ద రూ. 5 లక్షలు పట్టివేత

పట్టుకున్న డబ్బులను చూపిస్తున్న పోలీసులు

సిర్పూర్(టీ), మార్చి17 : మండలంలోని వెంకట్రావుపేట అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద రూ. 5 లక్షలకుపైగా పట్టుబడినట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా కౌటాల మండలం మొగడ్దగడ్‌కు చెందిన నరూలే భరత్ వద్ద రూ.2,72,560, అలాగే ఛత్తీస్‌గడ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇంద్రజిత్ వద్ద రూ. 70 వేలు, మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లావాసి నజీ మ్ సలీమ్ బక్స్ బొలేరో వాహనంలో రూ. 1,84,000 పట్టుకున్నట్లు తెలిపారు. ఈ ముగ్గురి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో డబ్బులు సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపా రు. కౌటాల సీఐ సాదిక్ పాషా, ఎస్ఐ దీకొండ రమేశ్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

నందిగూడలో రూ.4.87 లక్షలు

కాగజ్‌నగర్, మార్చి 17: మండలంలోని నందిగూడ చెక్ పోస్టు వద్ద రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐ సోనియా ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని ఐదుగురి వద్ద రూ.4,87,000 స్వాధీనం చేసుకున్నారు.

ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్
- అధికారులు, పలు పార్టీల ప్రతినిధులతో సమావేశం

మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, మార్చి 17 : లోక్‌సభ ఎన్నికలు సజావుగా సాగేలా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ కోరారు. ఆదివారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, ప్రత్యేక ఉప పాలనాధికారి చంద్రకళ, ఆర్డీవో రాములు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల్లో 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేషన్ స్వీకరించే సమయంలో సీసీ కెమెరాతో పాటు వీడియో చిత్రీకరణ ఉంటుందని చెప్పారు. నామినేషన్‌లు ఆన్‌లైన్ ద్వారా సమర్పించవచ్చని, అట్టి నామినేషన్ ప్రతిని సంబంధిత రిటర్నింగ్ అధికారికి నిర్ణీత పని వేళలో అందజేయాలని తెలిపారు. పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంబంధిత ఖర్చుల నిర్వహణ కోసం నామినేషన్ దాఖలు చేయడానికి ముందుగానే ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవాలని, వివరాలు నామినేషన్‌లో నమోదు చేయాలని, ప్రతి చెల్లింపు లావాదేవీలను ఖాతా ద్వారా మాత్రమే చేయాలని తెలిపారు. పోలింగ్ రోజు ఓటర్లు తమ ఓటు హక్కును ప్రభుత్వం జారీ చేసిన 12 రకాల గుర్తింపు కార్డుల ద్వారా ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు

నస్పూర్, మార్చి 17 : పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. ఆదివారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో రామగుండం సీపీ శ్రీనివాస్, జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, ప్రత్యేక ఉప పాలన అధికారి చంద్రకళ, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రాములుతో కలిసి ప్రింట్, ఎలక్ట్రానిక్ పాత్రికేయులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మొత్తంగా 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, 741 మంది బూత్ స్థాయి అధికారులు, 74 మంది సూపర్ వైజర్లను నియమించినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూంలను చెన్నూరులోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, బెల్లంపల్లిలోని బజార్ ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మంచిర్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రధాన స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను హాజీపూర్ మండలంలోని ముల్కల్లలోని ఐజా ఇంజిరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి టోల్‌ఫ్రీ నంబర్ 1950తో పాటు కంట్రోల్ రూం నంబర్ 08736-250501ను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు, మీడియా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎన్నికల అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పక పాటించాలి

నస్పూర్, మార్చి 17 : ఎన్నికల నిర్వహణలో విధులు కేటాయించబడిన అధికారులు, సిబంది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పక పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, అటవీ శాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, ప్రత్యేక ఉప పాలనాధికారి చంద్రకళ, ఆర్డీవోలు రాములు,హరికృష్ణతో కలిసి తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 741 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమల్లోకి వచ్చినందున 48 గంటల వ్యవధిలో ప్రభుత్వ ఆస్తులపై హోర్డింగులు, ఫ్లెక్సీలు, ఫొటోలు తొలగించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాల వివరాలు సమర్పించాలన్నారు.

కంట్రోల్ రూం తనిఖీ

నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూంను కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. ఆయన వెంట కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్ ఉన్నారు.

అద్దె బకాయిలు రూ. 2.11 కోట్లు

మంచిర్యాల మున్సిపాలిటీల్లో పేరుకుపోతున్న అద్దె సొమ్ము

- చెల్లింపుల్లో వ్యాపారుల నిర్లక్ష్యం
- పట్టనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు
- సబ్ లీజ్‌ల పేరిట అధిక కిరాయిలు వసూలు

మంచిర్యాలలోని కూరగాయల మార్కెట్‌లో మున్సిపల్ దుకాణాలు

మంచిర్యాల టౌన్, మార్చి 17: మంచిర్యాల మున్సిపాలిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌ల నుంచి నెలనెలా రావాల్సిన అద్దె బకాయిలు రెండుకోట్లకు పైబడి పేరుకుపోయాయి. వ్యాపారులు చెల్లింపుల విషయమే మరిచిపోయినట్లు కనిపిస్తుండగా, మున్సిపల్ అధికారులేమో పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలో మూడు ప్రాంతాల్లో 75 షాపులు మున్సిపాలిటీకి చెందినవి ఉండగా, అందులో 22 ఖాళీగా ఉన్నాయి. మిగిలిన 57 దుకాణాలకు సంబంధించిన అద్దె ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి రూ. 1.01 కోట్లు, పాత బకాయిలు రూ. 1.38 కోట్లు కలిపి మొత్తం 2.39 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు ప్రస్తుత ఏడాదికి సంబంధించిన అద్దెలు రూ. 4.88లక్షలు, పాత బకాయిలు రూ. 23.52 లక్షలు కలిపి మొత్తం రూ.28.40 లక్షలు మాత్రమే వసూలు చేశారు. ఇంకా ప్రస్తుత ఏడాదికి సంబంధించిన అద్దె రూ. 96.32 లక్షలు, పాతబకాయిలు రూ. 1.15 కోట్లు కలిపి మొత్తం రూ. 2.11 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. మార్కెట్ ఏరియాలో ఏ-టైప్ దుకాణాలు ఏడింటినుంచి రూ. 25.70 లక్షలు, బీ-టైప్ దుకాణాలు ఎనిమిదింటి నుంచి రూ. 33.26 లక్షలు, సీ-టైప్ ఎనిమిది దుకాణాలనుంచి రూ 27.99 లక్షలు, మొదటి అంతస్తు ఒక దుకాణం నుంచి రూ. 18.15 లక్షలు, డీ-టైప్ దుకాణం నుంచి రూ. 72 వేలు, మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న 22 ఐడీఎస్‌వంటి దుకాణాలనుంచి రూ.34.32 లక్షలు, ఐడీఎస్ ఎంటి కాంప్లెక్స్ మొదటి అంతస్తు నుంచి రూ. 46.08 లక్షలు, వాటర్ ట్యాంకు దగ్గర ఉన్న తొమ్మిది దుకాణాలనుంచి రూ. 24.45 లక్షలు వసూలు కావాల్సి ఉంది.

సబ్‌లీజులే అధికం

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో అద్దెకు తీసుకున్న వారిలో చాలామంది ఆ దుకాణాలను సబ్‌లీజులు ఇచ్చారు. మున్సిపాలిటీకి చెల్లించే అద్దె కంటే సబ్ లీజుకు తీసుకున్న వారినుంచి రెండింతలు మొదలుకుని నాలుగింతల వరకు వసూలుచేస్తున్నారు. వారి నుంచి నెలనెలా వసూలు చేసుకుంటున్న లీజుదారులు మున్సిపాలిటీకి చెల్లించాల్సిన అద్దెలను మాత్రం చెల్లించడం లేదు. ఫలితంగా మున్సిపాలిటీకి రావాల్సిన అద్దె కోట్లలో పేరుకుపోతున్నది. వాటర్ ట్యాంకు దగ్గర ఉన్న ఒక దుకాణానికి సంబంధించి నెల అద్దె రూ. 10 వేలు ఉండగా, సబ్ లీజు తీసుకున్న వ్యక్తి దగ్గర నుంచి రూ. 30 వేలు వసూలు చేస్తున్నారు. కూరగాయల మార్కెట్‌లో ఒక దుకాణం అద్దె రూ. 12 వేలు ఉండగా, దానిని మరో వ్యాపారికి రూ. 35 వేలకు సబ్‌లీజుకు ఇచ్చారు. ఇవే కాకుండా దుకాణాల ముందు చిరువ్యాపారాలు చేసుకునే వారికి అవకాశం కల్పించి వారి నుంచి అద్దె వసూలు చేసుకుంటున్నారు. పాత మటన్ మార్కెట్ స్థానంలో నిర్మించిన కాంప్లెక్స్‌లో మెట్ల కింద గోడకట్టి గుడ్ల దుకాణం నుంచి నెల అద్దె రూ. 10 వేలు, కంగన్ హాలు నుంచి రూ.10 వేలు వసూలు చేస్తున్నారు. ఇవి మున్సిపల్ రికార్డుల్లో లేని షాపులు. కానీ కాంప్లెక్స్‌ను అద్దెకు తీసుకున్న వ్యక్తి ఇలా చిరు వ్యాపారులకు కిరాయిలు ఇచ్చుకుంటూ అద్దెలు వసూలుచేసుకుంటున్నారు. కానీ మున్సిపాలిటీకి చెల్లించాల్సిన అద్దెలు మాత్రం చెల్లించడం లేదు.

దుకాణాలకు వేలం పాట నిర్వహిస్తాం

మున్సిపల్ కాంప్లెక్స్‌లలో దుకాణాలను అద్దెకు తీసుకున్న వారిలో చాలామంది సబ్‌లీజుకు ఇస్తున్నారు. ఇది మున్సిపాలిటీ చట్టం ప్రకారం విరుద్ధం. ఇలాంటి వారిని గుర్తిస్తున్నాం. త్వరలో మున్సిపల్ దుకాణాలకు వేలంపాటలు నిర్వహిస్తాం. వాస్తవ వ్యాపారులకే, ఇప్పటికే అక్కడ వ్యాపారం చేసుకుంటున్న వారికే ఆ షాపులను కేటాయిస్తాం. దీంతో వ్యాపారులకు అద్దె భారం తగ్గుతుంది. దుకాణానికి యజమానిగా మారుతాడు. ఖాళీగా ఉన్న 22 దుకాణాలను సైతం నిరుద్యోగ యువకులకు వ్యాపారాల కోసం తక్కువ ధరలకే కిరాయికీ ఇవ్వాలని నిర్ణయించాం. అద్దె బకాయిలను త్వరితగతిన వసూలు చేస్తున్నాం. పెద్ద మొత్తంలో బకాయి ఉన్న వ్యాపారులకు మూడురోజుల గడువు ఇచ్చాం. ఆ లోగా ఇవ్వకపోతే తదుపరి చర్యలు తీసుకుంటాం.

- ఉప్పలయ్య, మున్సిపల్ చైర్మన్

విజయోస్తు

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 52 కేంద్రాలు
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు

ఆసిఫాబాద్ టౌన్ : పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

మంచిర్యాల అర్బన్, మార్చి 17 : ఈ నెల 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనుండగా, అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. సీసీ కెమెరాల నిఘా నడుమ పరీక్షలు కొనసాగేలా చర్యలు చేపట్టారు.

52 పరీక్షా కేంద్రాలు

జిల్లావ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాలను కేటాయించారు. మొత్తం 9,298(4,790 బాలురు, 4,508 బాలికలు) మంది రెగ్యులర్ విద్యార్థులు, 339 మంది సప్లిమెంటరీ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఒక్కో ఎగ్జామ్ సెంటర్‌లో సుమారు 200 నుంచి 240 మంది విద్యార్థులు పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశారు. కేంద్రానికి ఒకరి చొప్పున చీఫ్ సూపరింటెండెంటు, డిపార్టుమెంట్ అధికారులను కేటాయించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్లు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. నిర్దేశించిన సమయంకంటే ఐదు నిమిషాలు ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుతో పాటు పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు కానుంది.

కుమ్రం భీ ఆసిఫాబాద్ జిల్లాలో..

ఆసిఫాబాద్ టౌన్, మార్చి17 : జిల్లా వ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 6,637 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సురేశ్‌కుమార్ తెలిపారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.

కౌటాల, మార్చి 17 : మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో సోమయ్య తెలిపారు. జడ్పీఎస్ఎస్‌లో 220 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, సీఎస్‌గా సత్యనారాయణ, డీవోగా లక్ష్మయ్య, 12 ఇన్విజిలేటర్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 150 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, సీఎస్‌గా జయంతి, డీవోగా రవికుమార్, 9 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో ఉంటారని ఆయన తెలిపారు.

బెజ్జూర్, మార్చి 17 : స్థానిక జడ్పీ పాఠశాల, కస్తూర్బా విద్యాలయంలో 243 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు సీఎస్‌లు నానాజీ, తులసీ రాం తెలిపారు. డీవోలు కన్నయ్య, అశోక్, ఇన్విజిలేటర్లు ఉన్నారు.

దహెగాం,మార్చి17 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బాలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 269 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎస్‌గా కిషన్ రావు, డీవోగా నరేందర్‌రావు, కస్తూర్బాలో సీఎస్‌గా అమరేందర్‌రెడ్డి, డీవోగా సుధాకర్ విధులు నిర్వహించనున్నారు.

కెరమెరి, మార్చి 17 : కెరమెరి జడ్పీ ఉన్నత పాఠశాల, మోడీలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొత్తం 155 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.